జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు



తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికి అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435



PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 183 | శనివారం | 29 నవంబర్- 2025 | పేజీలు : 4 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.


## అమరావతిలో బ్యాంకుల హబ్..

### 15 ఆర్థిక సంస్థల కార్యాలయాలకు శంకుస్థాపన చేసిన నిర్మల

**కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ చేతుల మీదుగా కార్యక్రమం**

**హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**

**రూ.1,328 కోట్ల పెట్టుబడులు, 6,500కు పైగా ఉద్యోగాల అంచనా**

**ఎస్బీఐ, ఎల్ఐసీ, నాబార్డ్ వంటి ప్రముఖ సంస్థల రాక**



(సందేశం టైమ్స్): రాజధాని అమరావతి నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. అమరావతిని ప్రధాన ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 15 బ్యాంకులు మరియు బీమా సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, పొంగూరు నారాయణ హాజరయ్యారు.రాజధానిలోని సీడ్ యాక్సెస్ రహదారి పక్కన ఉన్న సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద మొదటి బ్లాక్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఆర్థిక సంస్థల ఏర్పాటు ద్వారా రాజధానికి రూ.1,328 కోట్ల పెట్టుబడులు రానున్నాయని, తద్వారా సుమారు 6,514 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఏపీసీఆర్డీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ చారిత్రక కార్యక్రమంలో రాజధాని రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అమరావతిలో కార్యాలయాలను ఏర్పాటు చేయనున్న వాటిలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎల్ఐసీ, నాబార్డ్, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఐడీబీఐ వంటి ప్రముఖ జాతీయ సంస్థలు ఉన్నాయి. ఈ పరిణామంతో రాజధాని అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయని ప్రభుత్వం భావిస్తోంది.

## ప్రజారాజధాని అమరావతిలో చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టాం: సీఎం చంద్రబాబు



(సందేశం టైమ్స్): ఆంధ్రప్రదేశ్ ప్రజా రాజధాని అమరావతిని ప్రముఖ ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా మార్చే దిశగా శుక్రవారం కీలక ముందడుగు పడింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో 15 బ్యాంకులు, ప్రభుత్వ రంగ బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన చేశారు. దీనిపై చంద్రబాబు సోషల్ మీడియా ద్వారా స్పందించారు."ప్రజారాజధాని అమరావతిని ఒక శక్తివంతమైన ఆర్థిక కార్యకలాపాల కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయాణంలో ఈ రోజు ఒక చారిత్రక ముందడుగు వేశాం. గౌరవనీయ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గారిని ఈ కార్యక్రమానికి స్వాగతించడం మాకు లభించిన గౌరవంగా భావిస్తున్నాను. ఆమె చేతుల మీదుగా 15 జాతీయ బ్యాంకింగ్, ప్రభుత్వ రంగ బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలకు శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషాన్నిచ్చింది. అమరావతిని ఒక ఆధునిక ఆర్థిక కేంద్రంగా నిలపాలన్న మా ప్రణాళికలో భాగంగా, ఈ సంస్థలన్నింటికీ ప్రణాళికాబద్ధమైన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో భూమిని కేటాయించాం. ఈ కార్యక్రమానికి స్వయంగా హాజరై, మమ్మల్ని ప్రోత్సహించిన గౌరవనీయ కేంద్ర ఆర్థిక మంత్రి గారికి ఆంధ్రప్రదేశ్ ప్రజలందరి తరఫున నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

## దేవతల రాజధానిని

### దెయ్యాలు నాశనం చేయాలని చూశాయి: మంత్రి లోకేశ



(సందేశం టైమ్స్):ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "దేవతల రాజధాని అమరావతిని దెయ్యాలు విధ్వంసం చేయాలని చూశాయి. మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడి ఈ ప్రాంతాన్ని నాశనం చేయాలని ప్రయత్నించారు" అని ఆయన ఆరోపించారు. ఒక్క వ్యక్తి కోసం రూ.450 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నారని విమర్శించారు. రైతులు మాత్రం 'ఒకే రాష్ట్రం–ఒకే రాజధాని' నినాదంతో పోరాడారని, ఎన్ని ఇబ్బందులు పెట్టినా 'జై అమరావతి' అంటూ ముందుకు సాగారని కొనియాడారు.ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన ఈ రాజధానిని ఆపడం ఎవరి ఇంట్లో లైట్ స్విచ్ కాదని లోకేశ్ వ్యాఖ్యానించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అందిస్తున్న సహకారానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆమె నిరాడంబరతకు హ్యాట్సాఫ్ చెబుతూ, మంగళగిరి చేనేత వస్త్రాలను ధరించి వాటికి ప్రచారం కల్పించారని ప్రశంసించారు. పోలవరం, అమరావతి నిర్మాణానికి నిధులు ఇవ్వడంతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఆదుకోవడంలో విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రావడంలో ఆమె కీలక పాత్ర పోషించారని వివరించారు.

## అమరావతి భవిష్యత్తుకు ఇవి గట్టి పునాదులు

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్




**అమరావతి ఆర్థిక భవిష్యత్‌కు ఇది శుభసూచికం అన్న పవన్**

**ఏపీకి అండగా నిలుస్తున్న కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపిన డిప్యూటీ సీఎం**

(సందేశం టైమ్స్): రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రజలందరికీ కనిపించేలా పనిచేస్తోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం అమరావతి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో రూ.1334 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. అమరావతిని ఆర్థిక లావాదేవీల కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఈ కార్యక్రమం ఒక శుభసూచికమని పేర్కొన్నారు. పలు బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలు ఒకేచోట కొలువుదీరడం అరుదైన విషయమని, ఆ ఘనతను అమరావతి సాధించిందని అన్నారు. ఈ కేంద్రాలన్నీ ఒకేచోట ఉండటం వల్ల ఆర్థికంగా అందరికీ ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఈ రోజు వేస్తున్న పునాదులు అమరావతి ఆర్థిక భవిష్యత్తు నిర్మాణానికి అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉన్న విశ్వాసంతోనే రైతులు రాజధాని కోసం భూములు త్యాగం చేశారని పవన్ అన్నారు. అమరావతి పునర్నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, స్టీల్ ప్లాంట్ వంటి కీలక అంశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలుస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అడుగడుగునా సహకరిస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.


## పరకామణి కేసు..

### వైవీ సుబ్బారెడ్డిని ప్రశ్నిస్తున్న సీఐడీ



విజయవాడ, (సందేశం టైమ్స్): పరకామణి కేసులో సీఐడీ విచారణకు మాజీ టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఈరోజు (శుక్రవారం) విజయవాడలోని సీఐడీ కార్యాలయానికి చేరుకున్న వైవీ సుబ్బారెడ్డిని అడిషనల్ డీజీ రవి శంకర్ అయ్యన్నర్ విచారించారు. రెండు గంటల పాటు విచారణ సాగగా.. వైవీ సుబ్బారెడ్డి స్టేట్‌మెంట్‌ను సీఐడీ అధికారులు రికార్డ్ చేశారు. రెండు రోజుల క్రితం టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డి, సీఎస్‌వో నరసింహ కిషోర్‌లను సీఐడీ ప్రశ్నించిన విషయం తెలిసిందే. తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి కేసు డాక్యుమెంట్లను సీఐడీ కార్యాలయానికి అధికారులు తెప్పించుకున్నారు.డిసెంబర్ 2వ తేదీలోపు ఏపీ హైకోర్ట్‌లో కేసు నివేదికను సమర్పించాల్సి ఉంది. దీంతో ఈ కేసుకు సంబంధించి సీఐడీ కసరత్తు ముమ్మరం చేసింది. కాగా.. విచారణ అనంతరం వైవీ మీడియాతో మాట్లాడుతూ.. పరకామణి విషయంలో తనను సీఐడీ ప్రశ్నించిందని.. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పానని తెలిపారు.

## వాయు కాలుష్యంపై పార్లమెంటులో చర్చ జరాగాలి : రాహుల్ డిమాండ్



న్యూఢిల్లీ (సందేశం టైమ్స్): పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1 నుంచి 19 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా పలు నగరాల్లో వాయుకాలుష్యంపై పార్లమెంటులో చర్చ జరగాలని లోక్‌నభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ శుక్రవారం డిమాండ్ చేశారు. వాయు కాలుష్య సమస్యకు కేంద్రం వద్ద ఎలాంటి ప్రణాళిక గానీ, జవాబుదారీతనం గానీ లేదని రాహుల్ మండిపడ్డారు. 'నేను కలిసిన ప్రతి తల్లి నాకు ఒకే మాట చెబుతుంది. తన బిడ్డ విషపూరిత గాలిని పీల్చుకుంటూ పెరుగుతోంది అని. వారు ఈ విషయంపై అలసిపోయారు. భయపడ్డారు. ఇప్పుడు మాత్రం కోపంగా ఉన్నారు. మోడీజీ భారతదేశ పిల్లలు వాయుకాలుష్యంతో మన ముందు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనిపై మీరు మౌనంగా ఎలా ఉండగలుగుతున్నారు? మీ ప్రభుత్వం వద్ద వాయుకాలుష్యంపై ఎందుకు అత్యవసర ప్రణాళిక, జవాబుదారీ తనం లేదు? భారతదేశానికి వాయు కాలుష్యంపై తక్షణమే వివరణాత్మక చర్చ అవసరం.

## విమానాల్లో ఇరుముడిని హ్యాండ్ లగేజీగా తీసుకెళ్లేందుకు అనుమతి

(సందేశం టైమ్స్):శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప భక్తులకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ఆనందకరమైన వార్తను అందించింది. ఇకపై విమాన ప్రయాణాల్లో పవిత్ర ఇరుముడిని (కొబ్బరికాయతో సహా) చేతి సామాను (హ్యాండ్ లగేజ్)గా తమతో పాటే క్యాబిన్‌లోకి తీసుకెళ్లేందుకు అనుమతినిచ్చింది. ఈ మేరకు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శుక్రవారం అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది అయ్యప్ప భక్తులకు గణనీయమైన ఊరట కల్పించనుంది.వాస్తవానికి, ఇప్పటివరకు ఉన్న కఠినమైన విమానయాన భద్రతా నిబంధనల ప్రకారం, ఇరుముడిలోని కొబ్బరికాయ కారణంగా దానిని తప్పనిసరిగా చెక్–ఇన్ లగేజీలో ఉంచాల్సి వచ్చేది. తమ భక్తికి, దీక్షకు ప్రతీకగా భావించే ఇరుముడిని లగేజీలో పంపడం చాలా మంది భక్తులకు అసౌకర్యంగా, ఇబ్బందికరంగా ఉండేది. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించిన మంత్రి రామ్మోహన్ నాయుడు, భక్తుల విశ్వాసాలను, మనోభావాలను గౌరవిస్తూ ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

# సంగారెడ్డి జిల్లా గీత కార్మికులు రాష్ట్ర మహాసభలకు భారీగా తరలివెళ్ళారు




సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 28నవంబర్: సూర్యాపేటలో జరుగుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాలుగో మహాసభలకు సంగారెడ్డి జిల్లా నుంచి గౌడ సోదరులు, గీత కార్మికులు భారీగా తరలివెళ్లారు. జిల్లా కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా సూర్యాపేటకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రమేష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గీతా కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కల్లుగీత వృత్తికి రక్షణ కల్పించడంతో పాటు గీతా కార్మికుల ఉపాధి భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అలాగే

కల్లుగీత కార్పొరేషన్‌కు ?5000 కోట్లు కేటాయించి గౌడ సంక్షేమానికి వినియోగించాలి,గీతా కార్మికుల పెన్షన్‌ను ?4000కు పెంచాలి,ప్రతి సొసైటీకి ఈత%–%తాటి చెట్ల పెంపకానికి 5 ఎకరాల భూమి ఇవ్వాలి, గ్రామాల్లో అక్రమంగా నడుస్తున్న బెల్ట్‌షాప్‌లను నిర్మూలించాలని వారు డిమాండ్ చేశారు.సంగారెడ్డి జిల్లా నుండి జిల్లా కమిటీ సభ్యులు కృష్ణా గౌడ్, యాద గౌడ్, సత్య గౌడ్, సుధాకర్ గౌడ్, మురళి గౌడ్, నరసింహ గౌడ్, రాధా గౌడ్, కిష్టా గౌడ్, లింగం గౌడ్, రాజు గౌడ్, నరేందర్ గౌడ్, రమేష్ గౌడ్, మధు గౌడ్, వీరేందర్ గౌడ్, జనార్ధన్ గౌడ్, నవీన్ గౌడ్, అనిల్ గౌడ్, వేణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మరవెల్లి గ్రామంలో అగు దీక్షిత జన్మదిన వేడుకలు ఘనంగా



సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 28నవంబర్ సంగారెడ్డి జిల్లా

వట్పల్లి మండలం మరవెల్లి గ్రామానికి చెందిన మన్నే జగదీశ్వర్%–%జ్యోతి దంపతుల కుమార్తె అగు దీక్షిత పదేళ్ల జన్మదిన వేడుకలు గ్రామంలో ఉత్సాహభరితంగా జరిగాయి. కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొని దీక్షితకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. మన్నే కుటుంబ పెద్దలు, బంధువులు, అలాగే గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలకు మరింత శోభను తెచ్చారు. పిల్లల చిరునవ్వులతో ఆనందభరితంగా పుట్టినరోజు కార్యక్రమం సాగింది.

# బిస్లరి పరిశ్రమలో చట్ట విరుద్ధంగా తొలగించిన కార్మికులను వెంటనే తీసుకోవాలి

**బిస్లరీ కార్మికులకు శాండ్విక్, పార్లే యూనియన్లు సంపూర్ణ మద్దతు**

**న్యాయం జరిగే వరకు కార్మికులు ఐక్యంగా పోరాడాలి**

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి. పాండురంగారెడ్డి**




సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 28నవంబర్: బిస్లెరి పరిశ్రమలో చట్ట విరుద్ధంగా తొలగించిన కార్మికులను వెంటనే తీసుకోవాలని యాజమాన్యం మొండివైఖరి విడనాడాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి పాండురంగారెడ్డి , బిస్లరీ యూనియన్ అధ్యక్షులు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. ఈరోజు ఐడిఏ పాశమైలారం బిస్లరీ పరిశ్రమ వద్ద జరిగిన కార్మికుల ఆందోళనకు శాండ్విక్ , పార్లే ఎంప్లాయిస్ యూనియన్లు సంఘీభావ మద్దతు తెలియజేసినారు. ఈ సందర్భంగా పి పాండురంగారెడ్డి మాట్లాడుతూ బిస్లరీ కార్మికులు న్యాయం జరిగే వరకు ఐక్యంగా ఉండి పోరాడాలని, బిస్లరీ కార్మికులకు శాండ్విక్ యూనియన్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని అన్నారు. చట్టం ప్రకారం యూనియన్ ఏర్పాటు చేసుకుంటే తప్పేముందని అన్నారు. యూనియన్ పెట్టుకుంటే యాజమాన్యం కక్ష సాధింపులు చర్యలు వేధింపులు చేయడం సరైనది కాదని అన్నారు. కార్మికులను తొలగించడం చట్టానికి విరుద్ధం అని అన్నారు. కార్మికులం తొలగించి 28రోజులు అయినా యాజమాన్యం స్పందించకపోవడం దారుణమని అన్నారు. అతివేల మానిక్ మాట్లాడుతూ తొలగించిన బిస్లరి కార్మికుల వెంటనే తీసుకోవాలని కార్మికుల న్యాయం చేయాలని అన్నారు. జిల్లా ఉన్నత అధికారులు స్పందించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక ప్రశాంతత నెలకొల్పాలని అన్నారు. తొలగించిన కార్మికులను బే షరతుగా వెంటనే తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలో కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు చట్టాన్ని ఉల్లంఘించి కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బిస్లెరీ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని లేపక్షంలో పెద్ద ఎత్తున కార్మికులను సమీకరించి పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. పార్లే యూనియన్ ట్రెజరర్ రాజశేఖర్ మాట్లాడుతూ కార్మికులను తొలగించడం అన్యాయమని వెంటనే తీసుకోవాలని అన్నారు. బిస్లరీ కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి పార్లే యూనియన్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని అన్నారు ఈ ఆందోళన కార్యక్రమంలో శాండ్విక్ యూనియన్ ఆఫీస్ బేరర్ సదాశివరెడ్డి, పార్లే యూనియన్ జనరల్ సెక్రెటరీ సంతోష్ గౌడ్, నాయకులు వాసుదేవరావు రాజు, జనరల్ సెక్రెటరీ శేఖర్ రెడ్డి ఉపాధ్యక్షులు ప్రవీణ్ గౌడ్, జాయింట్ సెక్రెటరీలు కృష్ణ కుమార్, అజయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సతీష్ గౌడ్ కమిటీ సభ్యులు రాము, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# వట్టిపల్లి మండలంలో బీజేపీ స్థానిక ఎన్నికల సమావేశం

**ముఖ్య అతిధిగా మాజీ ఎంపీ**



సందేశం టైమ్స్ :సంగారెడ్డి జిల్లా ప్రతినిధి: 28 నవంబర్, సంగారెడ్డి: అందోల్ నియోజకవర్గంలోని వట్టిపల్లి మండల పరిధి పోతులబోగూడ గ్రామంలో స్థానిక ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. మండల అధ్యక్షుడు కార్చల్ల అశోక్ అధ్యక్షతన, చంటిప్రభు గారి నేతృత్వంలో వారి ఫామ్‌హౌస్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించారు.సభకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ బి.బి. పాటిల్ మాట్లాడుతూ, “ప్రతి గ్రామం నుంచి సర్పంచ్ పదవికి ఒక నాయకుడు, ప్రతి వార్డు నుంచి వార్డు సభ్యుల పదవికి ఒక బీజేపీ కార్యకర్త బరిలో దిగాలి. గ్రామ స్థాయిలో పార్టీ జెండా ఎగిరేలా కృషి చేయాలి” అని సూచించారు.జిల్లా అధ్యక్షుడు గోదావరి అంజిరెడ్డి, అందోల్ అసెంబ్లీ ఇంచార్జ్ ఆడికే జగదీశ్వర్, నాయకులు గంగ జోగినాథ్, బస్వరాజ్ పాటిల్, కల్లపల్లి శ్రీశైలంతో, జి మల్లికార్జున్ ,వివిధ మండలాల అధ్యక్షులు, పోటీదారులు, పార్టీ కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు.



# ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 75 వ భారత రాజ్యాంగ దినోత్సవం

**సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎడ్ల మోహన్ దాస్, TYJF రాష్ట్ర సెక్రెటరీ, మిద్దె మల్లేష్ యాదవ్**



సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ ప్రతినిధి: 75 వ రాజ్యాంగ దినోత్సవాన్ని పునస్కరించుకొని అధ్యక్షులు మోహన్ దాస్ గారు మాట్లాడుతూ ఈ దినోత్సవానికి పునాది 2015 అక్టోబర్‌లో ముంబైలోని ఇందు మిల్స్ కాంపౌండ్స్‌లో అంబేద్కర్ స్మారక చిహ్నం ప్రారంభోత్సవం సందర్భంగా వేయబడిందని ఆపై, నవంబర్ 19, 2015న, భారత ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ సహాయంతో నవంబర్ 26ని రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించిందిని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నటువంటి ఎస్సీ ఆర్ పి ఎస్ కార్యకర్తలు బీసీ సంఘ నాయకులు మాజీ సర్పంచులు అంజయ్య , కృష్ణ సురేష్, మహేష్, దశరథ్, నరసింహులు, సుధాకర్, నర్సింలు, శ్రీకాంత్, జనార్ధన్, కనకరాజ్, రాములు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# 30 వ వార్డు లో మహాత్మా పూలే 135 వ వర్ధంతి.....



సందేశం టైమ్స్ సంగారెడ్డి టౌన్ ప్రతినిధి: సంగారెడ్డి పట్టణం లోని బాలాజినగర్(30 వ వార్డు) లో గల మహాత్మా జోతిబా పూలే పార్క్ లో గల పూలే గారి ప్రతిమకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గొల్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి విశ్రాంత ప్రిన్సిపాల్ మాదేవిని అనంతయ్య అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా బి సి స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ మరియు అడ్వకేట్ అనుముల నర్సింగరావు హాజరై పూలే జీవిత విశేషాలు మరియు సామాజిక వివక్షకత పై వారి పోరాటాన్ని గుర్తు చేసి వారు సామాజిక విప్లవ పితామహుడని వారి బాటలోనే డా అంబెద్కర్, పెరియార్ రామస్వామి, సాహు మహారాజ్, నారాయణ గురు లాంటి వారు ఉద్యమాలు నిర్వహించి సామాజిక మార్పు ను కొంతమేరకు సాధించి పెట్టారని కాబట్టే మనం ఈ మాత్రం స్వేచ్ఛ, స్వతంత్రం, సమానత్వం అనుభవిస్తున్నామని కొనియాడారు. ఈ కార్యక్రమం లో పెద్దలు జి లక్ష్మయ్య,గజేందర్ రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రావణకుమార్, మెట్టు కృష్ణ, కవి సంజీవి,కాశీ విశ్వనాధ్, మున్నూరు ఆంజనేయులు, బిలాల్పూర్ నర్సిములు కలబగూర్ మహేష్ వార్డు యువనాయకులు బిల్డర్ అనిల్, అఖిల్ మరియు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బంధమా బతుకా దాంపత్యంలో ఏది ముఖ్యం

ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్) హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఒక తీర్పు హిందూ మహిళలకు భారత రాజ్యాంగ నీతి పూర్తిగా వర్తించే స్థితి ఇంకా ఏర్పడలేదని చాటుతున్నది. వివాహబంధంలో ఉండగా భర్త నుంచి విడిపోయి వేరొక పురుషునితో సహజీవనం చేస్తున్న మహిళకు ఆ మాజీ భర్త నుంచి, అతడి తరపు పోలీసు జోక్యం నుంచి రక్షణ కల్పించడానికి తిరస్కరిస్తూ నవంబర్ 15న ప్రయాగ్‌రాజ్ హైకోర్టు తీర్పు చెప్పింది. పురుషాధిక్య ఆధిపత్య భావజాల స్ఫూర్తితో రూపొందిన 1955 నాటి హిందూ వివాహ చట్టాన్ని ఉల్లంఘించడం సాధ్యం కాదని ఈ తీర్పు అర్థం. భర్తల దుర్మార్గం నుంచి రక్షణ కోసం, వైవాహిక 'జైలు' నుంచి తప్పించుకొని పారిపోయేవారిని మెడపట్టుకొని తిరిగి ఆ జైలుకే పంపించడం మానవీయమా?"వర్గానికి వర్గానికి మధ్య, స్త్రీ పురుషుల మధ్య (జెండర్ల మధ్య) అసమానత హిందూ సమాజం ఆత్మ. దానిని విడిచిపెట్టి ఆర్థిక సమస్యలకు సంబంధించిన చట్టాలు చేసుకొంటూపోవడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే. పేడకుప్ప పైన మేడ కట్టడమే," అని అంబేడ్కర్ తన హిందూ కోడ్ బిల్లును పార్లమెంట్ తిరస్కరించినప్పుడు మంత్రి పదవి నుంచి తప్పుకొంటూ సమర్పించిన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. మహిళను విముక్తం చేయడమన్న తన లక్ష్యం నెరవేరనందుకు నిరసనగానే అంబేడ్కర్ రాజీనామా చేశారు.సంప్రదాయ హిందూ సమాజంలో మహిళది రెండవ స్థాయి పౌరసత్వమే. దాని నిర్మాణం ప్రకారం ఆమె బతుకు ఆశయం పురుషుడి అడుగులకు మడుగులొత్తడమే. మన దేశాన్ని ఇప్పుడు పరిపాలిస్తున్న శక్తుల గురువైన ఆరెస్సెస్ సంస్థ అధినేత మోహన్ భగవత్ చెప్పిన ధర్మ సూత్రమూ ఇదే. భర్తకు సేవ చేయడమే భార్య పని అని 2013 జనవరిలో ఆయన స్పష్టంగా చెప్పారు. పురుషునితో ఆమెకు గల సామాజిక ఒప్పందం ప్రకారం ఆమె ఇంటి పనులకి పరిమితం కావాలి. పురుషుడు బయటి బాధ్యతలు చూసుకుంటూ ఉండాలి. ఇలా ఇంటి ఇంతిగా ఆమె అతడిని సంతృప్తిపరచడంలో విఫలమైన వెంటనే ఆమె పోషణ బాధ్యత నుంచి అతడు తప్పుకోవచ్చని, అక్కడితో భార్య భర్తల మధ్య సామాజిక కాంట్రాక్టు ముగిసిపోతుందని భగవత్ అభిప్రాయపడ్డారు. ఆడవారిపై లైంగిక అత్యాచారాలు దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో అరుదుగాను, పట్టణ ప్రాంతాలలో తరచుగానూ సంభవిస్తున్నాయని ఆయన అంతకు ముందు అన్నారు. అంటే సంప్రదాయ సమాజం గట్టిగా వేళ్ళూనుకుని ఉన్న గ్రామాల్లోనే మహిళ సురక్షితంగా బతుకుతున్నదని, ఆధునిక పురోగామి పట్టణ సమాజంలోనే ఆమెకు భద్రత కరువైందని ఆయన నొక్కి వక్కాణించారన్నమాట. పురాతన హిందూ సమాజం ఈ విలువలనే ఇప్పటికీ పాటిస్తున్నది. హిందూ వివాహచట్టంలోని 9వ సెక్షన్ ఈ పునాదుల పైనే నిర్మితమైంది.భార్య, భర్త విడిపోయిన తర్వాత ఒకరిపై ఒకరు దాంపత్య హక్కుల పునరుద్ధరణను కోరుతూ కోర్టుకు వెళ్లే అవకాశాన్ని హిందూ వివాహ చట్టంలోని 9వ సెక్షన్ ఉభయులకూ కల్పిస్తున్నది. ఆయా పరిస్థితులను పరిశీలించి కోర్టు ఆ హక్కును పునరుద్ధరించవచ్చునని పేర్కొంటున్నది. వైవాహిక అక్రమ వర్తనకు పాల్పడి భాగస్వామికి దూరంగా బతుకుతుంటే అటువంటి భార్య లేదా భర్తపై తనకుగల లైంగికత సహా సంపూర్ణ దాంపత్య హక్కును తిరిగి కల్పించాలని కోరుతూ జిల్లా కోర్టుకు వెళ్లే హక్కును 9వ సెక్షన్ కల్పిస్తున్నది. ఇది నిజానికి భార్యా భర్తా సమానులన్న అభిప్రాయం నుంచి ఉత్పన్నమైనది. కానీ వాస్తవంలో ఇప్పటికీ భర్తది పైచేయి, భార్యది కింది చేయిగానే ఉన్నది. భర్తతో బాటు అతడి తల్లి, తండ్రి, సోదరులు, ఆడపడుచులు కూడా ఆమెపై పెత్తనాన్ని, హింసాయుతమైన అణచివేతను అమలు చేస్తున్నారు. అందుచేత భార్య తనకు దూరమైన తన భర్తను తిరిగి తన దగ్గరకు చేర్చుకొనేలా దాంపత్య హక్కు పునరుద్ధరణను అర్థించడానికి, అదే పనిని భర్త స్థానంలోని వ్యక్తి చేయడానికి చాలా తేడా ఉంది.రాజ్యాంగం హామీ ఇస్తున్న వ్యక్తిగత, జీవన స్వేచ్ఛలు తిరుగులేనివి కావని, విడాకులు తీసుకోనందున ఆమెపై తన మాజీ భర్తకు ఇంకా హక్కు ఉంటుందని అలహాబాద్ తీర్పు స్పష్టం చేసింది. మహిళ తాను కోరుకొన్నట్టు వేరొకరితో ఉండాలీ అనుకొంటే భర్త నుంచి విడాకులు తీసుకోవాలని ఆ మహిళకు దిక్కు చూపింది. హిందూ వివాహ చట్టం 9వ సెక్షన్ మహిళకు శాపం వంటిదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎ.చౌదరి 1983 జూలైలో చలన చిత్ర నటి సరిత, వెంకటసుబ్బయ్య కేసులో తీర్పు ఇచ్చారు. ఈ సెక్షన్‌ను రద్దు చేస్తూ, ఇది జంటల వ్యక్తిగత గోప్యత హక్కును కాలరాస్తున్నదని, వివాహ బంధాన్ని కాపాడే నెపంతో పౌరుల ప్రాథమిక హక్కులను హరిస్తున్నదని జస్టిస్ చౌదరి తన తీర్పులో స్పష్టం చేశారు. అయితే జస్టిస్ చౌదరి విప్లవాత్మక తీర్పును సుప్రీంకోర్టు ఆ తర్వాత రద్దు చేసింది. అప్పటి నుంచి వివిధ కోర్టులు వివాహిత మహిళలకు విషం వంటి ఈ 9వ సెక్షన్‌ను ఆమె చేత బలవంతంగా తాగిస్తున్నాయి.పెళ్లి అనే వ్యవస్థను కాపాడాలని, భార్యాభర్తలు ఆ బంధానికి జీవిత కాలమంతా కట్టుబడి ఉండాలని 9వ సెక్షన్ కోరుతున్నది. కాని మహిళ అక్షరాస్యతలోనే కాదు విద్యాబుద్ధులు, ఆధునిక నిపుణతలలోనూ పురుషునితో సమానమైన స్థాయికి చేరుకొంటున్న వర్తమానంలో ఇష్టంలేని మగవానితో కలిసి కాపురం చేయవలసిన అగత్యాన్ని ఆమె ధైర్యంగా ఎదిరిస్తోంది. అసలు పెళ్లినే కాదని ఇష్టపూర్వక సహజీవనాన్ని సాగించే జంటల సంఖ్య పెరుగుతున్నది. చదువుకున్న, స్వతంత్ర వ్యక్తిత్వమూ చైతన్యమూ గల పలువురు స్త్రీలు సంప్రదాయ వివాహ వ్యవస్థను తృణీకరిస్తున్నారు. ఒంటరి జీవనాన్ని కోరుకొనే మహిళలు ఎక్కువవుతున్నారు. వివాహేతర సహజీవన బంధం అక్రమమైనది, న్యాయవిరుద్ధమైనది కాదని కూడా సుప్రీంకోర్టు నిర్ధారించింది. సహజీవన జంటలకు పుట్టే పిల్లలకు ఆస్తి హక్కు ఉంటుందని ప్రకటించింది. అందుచేత ఇష్టపూర్వక సహజీవన స్వేచ్ఛకు గల సంకెళ్ళను పటాపంచలు చేయాలి. మన సంపూర్ణ ప్రజాస్వామిక లక్ష్యాన్ని, లక్షణాన్ని కాపాడుకోవాలి.

# రైలులో నగల బ్యాగ్ చోరీ.. ఆపై డ్రెస్ మార్చి పరారీ..



**సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు.. నిందితుడిని పట్టిచ్చిన ర్యాపిడో బైక్**

**విజయవాడలో బంగారం అమ్ముతుండగా అరెస్ట్**

ఒంగోలు క్రైం, నవంబరు28(సందేశం టైమ్స్):ముఖానికి మాస్క్, తలకు టోపీ.. నెక్ టీ షర్ట్ వేసుకున్న ఓ వ్యక్తి హైదరాబాద్‌లో రైలెక్కాడు. ఆ తర్వాత టోపీ తీసేసి ఏ3 కోచ్‌లో కలియ తిరిగాడు. అర్ధరాత్రి సమయంలో ప్రయాణికులు నిద్రిస్తుండగా.. రూ.48 లక్షల విలువైన బంగారు నగలతో కూడిన బ్యాగును కాజేశారు. ఆ తర్వాత పూర్తిగా డ్రెస్ మార్చి.. ప్యాంట్, షర్ట్ ధరించి నెల్లూరులో దిగిపోయాడు. సినీ ఫక్కీలో అంతా ప్లాన్ ప్రకారమే చేసినప్పటికీ.. ర్యాపిడో బైక్ ఆ దొంగను పట్టించింది. ఈ నెల 13న చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన దొంగతనం కేసులో రైల్వే పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి రూ.48.10 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గురువారం స్థానిక రైల్వే పోలీసుస్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో నెల్లూరు రైల్వే డీఎస్పీ జీ.మురళీధర్ ఆ వివరాలు తెలియజేశారు. .చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో చోరీపై రైల్వే డీఐజీ సత్య ఏసుబాబు నేతృత్వంలో ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాల మేరకు పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా ఈనెల 13న రాత్రి హైదరాబాద్‌లోని నాంపల్లి రైల్వేస్టేషన్‌కు ర్యాపిడో బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తిని పోలీసులు అనుమానించారు. అతను ఎవరు అని ఆరా తీయగా బాలాపూర్‌కు చెందిన మహ్మద్ షకీల్‌గా గుర్తించారు. అతని కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు విజయవాడలో బంగారం అమ్ముతుండగా ఉదయం ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఇళ్లలో దొంగతనాలు చేసే మహ్మద్ షకీల్ ఈ నెల 13న తన ఇంటి దగ్గర నుంచి నాంపల్లి స్టేషన్ వరకు ర్యాపిడో బైక్ బుక్ చేసుకున్నాడు. హైదరాబాద్ నుంచి నెల్లూరు వెళ్లేందుకు టికెట్ కొనుగోలు చేశాడు. మాస్కు ధరించి, తలకు టోపీ పెట్టుకుని స్టేషన్‌లోకి ప్రవేశించిన షకీల్ ఆ సమయంలో నెక్ టీషర్ట్‌తో ఉన్నాడు. బండి ఎక్కిన తర్వాత టోపీ తీసేసి తిరిగాడు. ఏ3 కోచ్‌లో బ్యాగ్ దొంగిలించిన తర్వాత పూర్తిగా డ్రెస్ మార్చి షర్ట్, ప్యాంట్ వేసుకున్నాడు. మాస్క్ తీసేసి.. టోపీ పెట్టుకున్నాడు. ఆ తర్వాత నెల్లూరులో రైలు దిగాడు. అక్కడ నుంచి విజయవాడ వరకు రైలులో ప్రయాణం చేసి, హైదరాబాద్‌కు బస్సులో వెళ్లినట్లు సీసీ ఫుటేజీ ద్వారా రైల్వే పోలీసులు గుర్తించారు.

# జిల్లా అభివృద్ధికి కృషి చేయండి

**ఉపాధి నిధులను పూర్తిగా వినియోగించుకోవాలి**

**సహజ ప్రసవాలు జరిగేలా చూడాలి**

**రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావు**



విజయనగరం,నవంబరు28(సందేశం టైమ్స్): అధికారులంతా జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వి.జోగేశ్వరరావు సూచించారు. గతంతో పోల్చితే ప్రస్తుతం జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందని, రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెట్టాలని అన్నారు. చైర్మన్‌తో పాటు కమిటీ సభ్యులు నిమ్మక జయకృష్ణ, మద్దిపాటి వెంకటరాజు, డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు, వరుదు కళ్యాణి జిల్లాలో పర్యటించారు. అనంతరం కలెక్టరేట్‌లో వివిధ ?శాఖల అధికారులతో సమీక్షించారు. చైర్మన్ మాట్లాడుతూ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో సేంద్రీయ వ్యవసాయం ద్వారా కూరగాయలు పండించి మధ్యాహ్న భోజన పథకానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయడానికి డీఆర్‌డీఏ రూపొందించిన ప్రణాళికను అభినందించారు. ఈ ప్రణాళిక రాష్ట్రమంతా అమలు చేయడానికి కృషి చేస్తామని ప్రకటించారు. జిల్లాలో అక్షరాస్యత తక్కువ ఉందని, దీనిని పెంచేందుకు కృషి చేయాలన్నారు. వరి ఉత్పాదకత పెంచాలని, సబ్సిడీపై రెయిన్‌గన్‌లను అందజేసేందుకు ప్రతిపాదన చేయాలని సూచించారు. సహజ ప్రసవాలను ప్రోత్సహించాలని, సిజేరియన్లను తగ్గించాలని చెప్పారు. ఉపాధి పథకం నిధులతో పాఠశాలల ప్రహరీలు, లింకు రోడ్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని చైర్మన్ ఆదేశించారు. ని?ధులు పూర్తిగా వినియోగించుకోవాలని, మురిగిపోకుండా చూడాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, విలేజ్ హెల్త్ సెంటర్ల భవనాలు పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థలోనూ, అద్దె భవనాల్లోనూ ఉన్నాయని, సమీపంలో ఉన్న ఖాళీగా ఉండే ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని సూచించారు. కమిటీ సభ్యులు నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా పాఠశాలల ప్రహరీలు నిర్మించాలని సూచించారు ఎమ్మెల్సీ డాక్టర్ సూర్యనారాయణరాజు మాట్లాడుతూ తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల కు ఆరోగ్య పింఛన్లు మంజూరు చేయాలన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన అంశాలను జేసీ సేతు మాధవన్ చైర్మన్‌కు వివరించారు. ధాన్యం సేకరణ సమయంలో రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమీక్షలో డీఆర్‌వో శ్రీనివాస్‌మూర్తి, సీపీవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఫీజు చిక్కులకు చెక్!



**ప్రైవేటు యూనివర్సిటీ ఫీజులపై త్వరలో జీవో**

**హడావిడిగా ప్రైవేటు వర్సిటీ చట్టాన్ని సవరించిన వైసీపీ**

**కానీ, ఫీజులపై స్పష్టత ఇవ్వని నాటి ప్రభుత్వం**

**ఫీజుల కోసం విద్యార్థులపై వర్సిటీల ఒత్తిడి**

**ప్రత్యేక ఉత్తర్వు ఇవ్వాలని సర్కారు నిర్ణయం**

(అమరావతి, నవంబరు28(సందేశం టైమ్స్): :వైసీపీ ప్రభుత్వం చేసిన పొరపాట్లను కూటమి ప్రభుత్వం సరిదిద్దుతోంది. హడావిడిగా ఆనాడు ప్రైవేటు యూనివర్సిటీల చట్టాన్ని సవరించిన జగన్ ప్రభుత్వం, ఫీజుల చెల్లింపుపై మాత్రం స్పష్టత ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసింది. దానివల్ల నెలకున్న సాంకేతిక సమస్యలకు చెక్ పెట్టాలని నిర్ణయించిన ప్రభు త్వం, త్వరలోనే ప్రత్యేక జీవో జారీచేయాలని నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు యూనివర్సిటీల చట్టాన్ని సవరించి 35 శాతం సీట్లను కన్వీనర్ కోటా కిందకు మార్చింది. కానీ ఆ కోటా కింద అడ్మిషన్లు పొందే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలుపై స్పష్టత ఇవ్వలేదు. చట్ట సవరణ అనంతరం జారీచేసిన జీవోల్లోనూ ఫీజుల చెల్లింపు గురించి స్పష్టత ఇవ్వలేదు. దీంతో 35 శాతం కోటా సీట్లలో చేరిన విద్యార్థులకు ఫీజుల చెల్లింపులో సాంకేతిక సమస్య ఏర్పడింది. ఆలస్యంగా పొరపాటును గుర్తించిన నాటి ప్రభుత్వం ఏటా ప్రత్యేకంగా ఫైలు పెట్టి ప్రైవేటు యూనివర్సిటీల విద్యార్థులకు ఫీజులు విడుదల చేస్తోంది. ఈ ఏడాది ఫీజులు విడుదల చేసినప్పుడు ఆ సమస్య మళ్లీ తలెత్తింది. ప్రైవేటు కాలేజీలు, యూనివర్సిటీ అనుబంధ కాలేజీల ఖాతాలకు ఫీజులు వెళ్లగా, ప్రైవేటు యూ నివర్సిటీలకు మాత్రం వెళ్లలేదు. దీంతో ప్రైవేటు యూనివర్సిటీల్లో చదివే విద్యార్థులపై ఒత్తిడి పెరిగింది. అమరావతిలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీ దీనిపై ఇంకా అత్యుత్సాహం ప్రదర్శించింది. తమ వర్సిటీలో చదివే పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదని, అందువల్ల వెంటనే ఫీజులు కట్టాలని ఆ యూనివర్సిటీ యాజమాన్యం విద్యార్థులకు మెయిల్స్ పంపింది. ఇది వివాదంగా మారడంతో మంత్రి లోకేశ్ కార్యాలయం స్పందించింది. ఫీజుల పథకం వర్తించదని ఎవరు చెప్పారంటూ ఆ యూనివర్సిటీ యాజమాన్యాన్ని నిలదీసింది. సమస్యపై దృష్టిపెట్టిన ఉన్నత విద్యాశాఖ, ప్రతిసారీ ఫీజులు విడుదల చేసినప్పుడు ఈ సమస్య తలెత్తకుండా ప్రత్యేకంగా జీవో తీసుకురావాలని నిర్ణయించింది. త్వరలోనే ఈ జీవో విడుదల చేస్తారు.



# ఏడాదిగా పెండింగులోనా?

అమరావతి,నవంబరు28(సందేశం టైమ్స్):: వైసీపీ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ రాజీనామా లేఖపై శాసన మండలి చైర్మన్ మోషేను రాజు నిర్ణయం వెల్లడించకుండా ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉంచడంపై హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. విచక్షణాధికారం పేరుతో సహేతుక సమయంలో నిర్ణయం వెల్లడించకపోవడం విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని స్పష్టంచేసింది. 33వ రాజ్యాంగ సవరణ ప్రకారం.. చట్టసభలకు ఎన్నికైన సభ్యుడు రాజీనామా లేఖ సమర్పించిన అనంతరం.. దానిపై విచారణ జరిపి కనీసం 15 రోజుల్లో.. గరిష్ఠంగా నెల రోజుల్లో ఏదో ఒక నిర్ణయం వెల్లడించాల్సిన బాధ్యత స్పీకర్/చైర్మన్‌పై ఉందని తేల్చిచెప్పింది. పిటిషనర్ విషయంలో మండలి చైర్మన్ చర్య సదరు సవరణ స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని.. నిర్ణయం వెల్లడించేందుకు సుదీర్ఘ సమయం తీసుకోవడం చట్టవిరుద్ధమని ప్రకటించింది. పదవికి రాజీనామా చేస్తూ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సమర్పించిన లేఖపై విచారణను నాలుగువారాల్లో ముగించి నిర్ణయం వెల్లడించాలని చైర్మన్‌ను ఆదేశించింది. అనంతరం ఆ నిర్ణయాన్ని పిటిషనర్‌కు తెలియపరచాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ తీర్పు వెలువరించారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తూ గత ఏడాది నవంబరు 23న మండలి చైర్మన్‌కు లేఖ సమర్పించానని.. దానిపై నిర్ణయం వెల్లడించేలా ఆయన్ను ఆదేశించాలని కోరుతూ జయమంగళ వెంకటరమణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజీనామా లేఖ సమర్పించి ఏడాది (అప్పటికి 9 నెలలు) గడుస్తున్నా ఇప్పటివరకు దానిని ఆమోదించడం గానీ, తిరస్కరించడం గానీ చేయలేదన్నారు. ఏపీ శాసనసభ కార్యకలాపాల నిర్వహణ విధానంలోని 186వ నిబంధన.. అధికరణ 190(3)బీ ప్రకారం రాజీనామా సమర్పించాక దానిని ఆమోదించడమో, తిరస్కరించడమో చేయాల్సిన రాజ్యాంగబద్ధమైన బాధ్యత చైర్మన్‌పై ఉందని తెలిపారు.

# మాజీ నక్సలైట్ దారుణ హత్య..




రాజన్న సిరిసిల్ల, నవంబరు28(సందేశం టైమ్స్): రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారం గుట్టల్లో మాజీ నక్సలైట్ దారుణ హత్యకు గురయ్యారు. హత్య ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మాజీ నక్సలైట్‌ని తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేట గ్రామానికి చెందిన మాజీ నక్సలైట్ సిద్దయ్య అలియాస్ నర్సయ్య (50)గా గుర్తించారు. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.సిద్దయ్యను బండరాళ్లతో తలపై కొట్టి దారుణంగా హత్య చేశాడు సంతోశ్ అనే వ్యక్తి. గతంలో నక్సల్స్ ఉద్యమంలో పని చేసి, లొంగిపోయాడు సిద్దయ్య. ఓ యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూ ఉందని సిద్దయ్యను పిలిచాడని... ఓ ప్లాన్ ప్రకారమే . సంతోశ్ హత్య చేసినట్లుగా వార్తలు వస్తున్నాయి. హత్య చేసిన అనంతరం జగిత్యాల పోలీసు స్టేషన్‌లో నిందితుడు సంతోశ్ లొంగిపోయినట్లు సమాచారం.నిందితుడుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. అసలు సిద్ధయ్యను హత్య చేయడానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. సిద్ధయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలుస్తోంది. సిద్ధయ్య మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గండిలచ్చపేట గ్రామస్తులు సిద్ధయ్య కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# అంబర్‌పేట్ ఎస్ఐ గన్ మిస్సింగ్ కేసులో కొనసాగుతున్న దర్యాప్తు



హైదరాబాద్,నవంబరు28(సందేశం టైమ్స్):అంబేర్‌పేట్ ఎస్సై గన్ మిస్సంగ్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. గన్ మిస్సింగ్‌పై ఎస్ఐ భానుప్రకాష్ రెడ్డి పొంతనలేని సమాధానాలు చెబుతున్నట్లు తెలుస్తోంది. ఎక్కడ పెట్టానో గుర్తులేదు అంటూ సమాధానాలు ఇస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భాను ప్రకాష్ ఐదు నెలల క్రితమే గన్‌ను మిస్ చేశాడు. జర్నీలో ఎక్కడో బ్యాగ్ పోగొట్టుకున్నా అని చెబుతూ వచ్చాడు. అయితే గత ఐదు నెలల నుంచి గన్ మిస్ అయిన విషయాన్ని పై అధికారులకు చెప్పకుండా ఎస్సై దాచిపెట్టినట్లు తెలుస్తోంది.మరొక ఉద్యోగం రావడంతో ఏపీకి వెళ్లేందుకు ఎన్వోసీని ఎస్ఐ అడుగగా.. సర్వీస్ రివాల్వర్ ఇవ్వాలని వారు సూచించారు. దీంతో అసలు బండారం బయటపడింది. ఎస్ఐ భానుప్రకాష్ తన గన్‌ను మిస్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో అంబర్‌పేట్ పోలీసులు ఇన్వెస్టిగేషన్ కొనసాగుతోంది.మరోవైపు పోలీసు శాఖకు మచ్చ తెచ్చే విధంగా ఎస్ఐ ప్రవర్తించినట్లు తెలుస్తోంది. బెట్టింగ్‌లను ఆపాల్సిన ఎస్ఐ.. విపరీతంగా బెట్టింగ్‌లు ఆడి లక్షలు పోగొట్టుకున్నట్లు సమాచారం. అంతే కాకుండా బెట్టింగ్ కోసం ఏకంగా తన పొలాన్నే అమ్ముకున్న వైనం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కడప జిల్లాలో ఉన్న రాయచోటిలో పొలాలను ఎస్ఐ అమ్ముకున్నాడు. దాదాపు రూ.96 లక్షలకు పైగా డబ్బులను ట్రాన్సాక్షన్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

# టాప్‌–10లో హైదరాబాదీ బిర్యానీ



నవంబరు28(సందేశం టైమ్స్):ప్రపంచ అత్యుత్తమ రైస్ డిష్‌లలో హైదరాబాద్ బిర్యానీ టాప్ 10లో చోటు దక్కించుకుంది. 'వరల్డ్స్ బెస్ట్ రైస్ డిషెస్ లిస్ట్ ఆఫ్ 2025' అంటూ ఆన్‌లైన్ ట్రావెల్ గైడ్ టేస్ట్ అట్లాస్ జాబితాను విడుదల చేసింది. హైదరాబాదీ బిర్యానీ 10వ స్థానంలో నిలవడమే కాదు.. ఈ జాబితాలో ఎంపికైన టాప్ 50 డిషెసలో కూడా ఇండియా నుంచి ఎంపికైన ఒకే ఒక్క డిష్ ఇదే కావడం విశేషం. చెఫ్‌లు, ఫుడ్ క్రిటిక్స్ చేసిన సమీక్షలతో పాటుగా యాత్రికులు అందించిన రేటింగ్స్ ద్వారా హైదరాబాదీ బిర్యానీని టాప్10 రైస్ డిష్‌గా ఎంపిక చేశారు. ఈ జాబితాలో అధిక శాతం జపనీస్ వంటకాలే ఉండటం విశేషం. కాగా, టాప్ 10లో మొదటి మూడు డిషెస్ నెగిటోరోడాన్, సుషీ, కైసెన్డాన్‌లు జపనీస్ వంటకాలే కావడం గమనార్హం. ఇండియాలో లక్నో, కశ్మీరీ, కోల్‌కతా.. విభిన్న ప్రాంతాలకు సంబంధించి ప్రత్యేక బిర్యానీలు ఉన్నప్పటికీ హైదరాబాదీ బిర్యానీ అగ్రగామిగా నిలిచింది. మరో విశేషమేమిటంటే టాప్ 50లో బిర్యానీ పేరిట నిలిచిన మరో వంటకం ఇరాన్‌కు చెందినది కావడం గమనార్హం.

# 8 ఏళ్లు.. 80 కోట్ల మంది.. ఇదీ మన మెట్రో చరిత్ర



- నగరవాసులను అలరిస్తున్న మెట్రో రైళ్లు
- వేగవంతమైన ప్రయాణ సౌకర్యం
- 2017 నవంబర్ 28న ప్రారంభం
- అప్పటి నుంచి నిరంతరాయంగా సేవలు


హైదరాబాద్ సిటీ:నవంబరు28(సందేశం టైమ్స్): హైదరాబాద్ నగరంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మెట్రో రైలు ప్రయాణం సదా మీ సేవలో అంటూ ముందుకు సాగిపోతోంది. సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందిస్తూ నగరవాసులను అక్కున చేర్చుకుని దినదిన ప్రవర్ధ మానంగా వెలుగొందుతోంది. ఏడేళ్లు పూర్తి చేసుకుని శుక్రవారం ఎనిమిదో ఏటా అడుగుపెడుతున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.నగరంలో ట్రాఫిక్ రహితమైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందించాలనే ఉద్దేశంతో 2012లో ప్రైవేట్ పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లో హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును చేపట్టిన విషయం తెలిసిందే. ఎల్‌బీనగర్–మియాపూర్, జేబీఎస్–ఫలక్‌నుమా, నాగోల్– రాయదుర్గం కారిడార్లలో రూ.14,132 కోట్ల వ్యయంతో 72 కి.మీ. మేర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో మతపరమైన కట్టడాలు అడ్డుగా ఉన్న కారణంగా కారిడార్–2ను జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు మాత్రమే నిర్మించారు. ప్రస్తుతం 69.2 కిలోమీటర్ల పరిధిలో రైళ్లు నడుస్తున్నాయి. ఉదయం 6 గంటలకు ప్రారంభమై రాత్రి 11.15 గంటల వరకు నిర్విరామంగా తిరుగుతూ అన్ని వర్గాల ప్రజలకు మెట్రో రైలు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పిస్తోంది.ఎల్‌బీనగర్–మియాపూర్, నాగోల్–రాయదుర్గ్ కారిడార్లలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు బోగీల్లో కాలుపెట్టని పరిస్థితి నెలకొంటుంది. కాగా, రోజువారీగా ప్రయాణిస్తున్న సుమారు 4.80 లక్షల మందిలో 51.5 శాతం మంది ఉద్యోగులే ఉన్నట్లు ఇటీవల ఎల్‌అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ట్విటర్ (ఎక్స్)లో నిర్వహించిన పోల్ ద్వారా వెల్లడించింది. గమ్యస్థానాలకు త్వరగా చేరుకునేందుకు 30.3 శాతం, కాలేజీ, పాఠశాలలకు వెళ్లేందుకు 6.1 శాతం మంది ఉన్నారని, మిగతా 12.1 శాతం స్నేహితులు, బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు మెట్రో వేగవంతమైన ప్రయాణ సాధనంగా ఉపయోగపడుతోందని అభిప్రాయపడినట్లు పేర్కొంది. కాగా, 2017 నవంబరు 29 నుంచి ఈ ఏడాది నవంబరు 26 వరకు సుమారు 80.21 కోట్ల మంది ప్రయాణం చేసినట్లు తెలిసింది.నగరంలో మెట్రో రైలు రవాణాను మరింతగా విస్తరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ మేరకు పార్ట్–ఏ కింద 5 కారిడార్లు, పార్ట్–బీ కింద 3కారిడార్లను చేపడుతోంది. మొత్తం 8 కారిడార్లలో 163 కిలోమీటర్లను రూ.43,848 కోట్ల వ్యయంతో ప్రతిపాదించారు. వీటికి సంబంధించిన డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)లు ప్రస్తుతం కేంద్రం వద్ద పరిశీలనలో ఉన్నాయి. 2026 మార్చిలోగా వాటికి అనుమతి వచ్చే అవకాశం ఉందని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) అధికారులు చెబుతున్నారు. కాగా, రెండో దశ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే మహానగరంలో మెట్రోకు మరింత కీర్తి లభించనుంది.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణపై స్టే విధించలేం: హైకోర్టు




హైదరాబాద్,నవంబరు28(సందేశం టైమ్స్):: పంచాయతీ ఎన్నికల నిర్వహణపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ దశలో ఎన్నికలపై స్టే విధించలేమని స్పష్టం చేసింది న్యాయస్థానం. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చాక కోర్టుల జోక్యం ఉండకూడదని ఈసీ అడ్వొకేట్ తేల్చిచెప్పారు. సబ్ క్యాటగిరీ రిజర్వేషన్ లేనందుకు మీరు ఎన్నికలు రద్దు చేయాలనీ కోరుకుంటున్నారా ? అని పిటీషనర్‌ను హై కోర్టు ప్రశ్నించింది.42శాతం రిజర్వేషన్ జీవో విచారణ సమయంలో పాత పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని తామే చెప్పాం కదా అని హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. కాగా, పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ జీవో– 46పై హై కోర్టులో ఇవాళ(శుక్రవారం) విచారణ జరిగింది. గతంలో 2009లో ఇదే తరహా పరిస్థితి వచ్చినప్పుడు జీహెచ్ఎంసీ ఎలక్షన్‌ను రద్దు చేశారని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టుకు గుర్తుచేశారు. ఈ దశలో తాము ఎలాంటి జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది న్యాయస్థానం.తామే ఎన్నికలు నిర్వహి చాలని ఆదేశించి, తామే స్టే ఎలా ఇస్తాం ?? అని హై కోర్టు ప్రశ్నించింది. ఈ క్రమంలో డెడికేటెడ్ కమిషన్ రిపోర్టును బహిర్గతం చేసి కాపీ ఇవ్వాలని కోరారు పిటిషనర్ న్యాయవాది. ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమన్న హై కోర్టు తేల్చిచెప్పింది. సబ్ క్యాటగిరి రిజర్వేషన్‌లపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఆరువారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం హుకుం జారీ చేసింది. తదుపరి విచారణను 8 వారాలకు వాయిదా వేసింది హై కోర్టు.

# మళ్లీ సర్పంచ్ పదవా.. వద్దే వద్దు!

కొత్తూర్, నవంబరు28(సందేశం టైమ్స్): ఒకసారి గెలిచి.. ఐదేళ్లు సర్పంచ్‌గా పనిచేసిన వారిలో ఎంతమంది మళ్లీ పోటీ చేయాలని అనుకుంటున్నారు? తాజా మాజీల్లో ఎవరైనా పోటీకి ఆసక్తి చూపుతున్నారా? ఏమో గానీ ఓ తాజా మాజీ చెబుతున్న సంగతులు మాత్రం సర్పంచ్‌లుగా పనిచేసిన వారికి ఎదురైన రకరకాల ఇబ్బందులను తేటతెల్లం చేసేలా ఉన్నాయి. "సర్పంచ్ పదవి అంటే గౌరవమర్యాదలు దక్కుతాయని అనుకున్నాను. గ్రామాభివృద్ధి కోసం ఎంతో చేశాను. చివరికి నాకు 14పోలీసు కేసులు, రూ.50లక్షల అప్పు బహుమానంగా మిగిలాయి" అని రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండల పరిధిలోని మక్తగూడకు చెందిన తాజా మాజీ సర్పంచ్ కాట్న రాజు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ పదవులు అలంకార ప్రాయంగా మారాయని.. మరోసారి సర్పంచ్ పదవా? వద్దు బాబోయ్ వద్దు.. మళ్లీ పోటీచేస్తే నా బతుకు ఆగమవడం పక్కా అని వణికిపోతున్నారాయన. రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండల పరిధిలోని మక్తగూడ గ్రామపంచాయతీ 2019లో కొత్తగా ఏర్పడింది. అప్పటి ఎన్నికల్లో గ్రామానికి చెందిన కాట్న రాజు సర్పంచ్‌గా గెలుపొందారు. గ్రామపంచాయతీ భవనం, డంపింగ్‌యార్డు, స్మశానవాటిక, పల్లె ప్రకృతి వనాన్ని ఆయన నిర్మించారు. అయితే, ప్రభుత్వ స్థలాల కబ్జాను ప్రశ్నించిన తనపై అట్రాసిటీ కేసు సహా 14 కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి నిధులొస్తాయనే నమ్మకంతో సొంతంగా రూ.50లక్షలు వెచ్చించి భూగర్భ మురుగునీటి కాలువల నిర్మాణాలు, సీసీ రోడ్లు పూర్తి చేశానని.. ఖర్చు చేసిన డబ్బులో పైసా కూడా రాలేదని రాజు చెప్పారు. బిల్లుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

# పాలమూరులో ఆటో ఎక్స్‌పో

మహబూబ్‌నగర్, నవంబరు28(సందేశం టైమ్స్): పాలమూరు జిల్లా కేంద్రం రెండు రోజులపాటు ప్రముఖ కంపెనీల బ్రాండెడ్ కార్లకు వేదిక కానున్నది. ఈనెల 29, 30వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో రెండ్రోజుల పాటు భారీ ఎత్తున ఆటో ఎక్స్‌పో నిర్వహిస్తున్నారు. దినపత్రికల సంయుక్త ఆధ్వర్యంలో వాహనాల మేళా జరగనున్నది. దేశంలోనే ప్రసిద్ధి చెందిన హై క్లాస్ అరేంజ్ కార్లతోపాటు మధ్య తరగతి జనానికి నచ్చే.. మెచ్చే కార్లకు.. వాహనాలను ఇందులో ప్రదర్శించనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర ంలో కనీవిని ఎరగని రీతి లో నిర్వహించనున్న ఈ కార్ల మేళాలో బీఎండబ్ల్యూ, స్కోడా, టయోటా హైబ్రీడ్, లోకల్ మారుతి ఆరేనా, నెక్సా.. హ్యుందాయ్, మహేంద్ర కార్లతోపాటు బైకులు, ఎలక్ట్రికల్ వాహనాలు కూడా కొలువు దీరబోతున్నాయి.%ఈ ఎక్స్‌పోలో ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మహేంద్ర ట్రాక్టర్ ఓజో కూడా రైతు సోదరులకు సరికొత్త రీతిలో కనువిందు చేయ నున్నది.

# పెద్దపల్లి జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి




పెద్దపల్లి రూరల్ నవంబరు28(సందేశం టైమ్స్): పెద్దపల్లి జిల్లాలో విషాదం నెలకొంది. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనుల కోసం ఎఫ్‌సీఐకి ఉదయం బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని వెనుక నుంచి ఓ కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు.పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి మండలం అందుగులపల్లి గ్రామానికి చెందిన పిడుగు గోపాల్ ఎఫ్సీఐలో ట్రాక్టర్ డ్రైవర్ గా పని చేస్తున్నాడు. రోజు వారి మాదిరిగానే శుక్రవారం కూడా తన బైక్ పై పనికి వెళ్తున్న క్రమంలో అందుగులపల్లిలోని ఇంటి నుంచి బయలు దేరి గ్రామసమీపంలోని పెట్రోల్ పంపు దాటుతున్న క్రమంలో పెద్దపల్లి వైపు నుంచి గోదావరిఖనివైపే వెళ్తున్న కారు వెనుక నుంచి వేగంగా ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్ వెళ్తున్న పిడుగు గోపాల్ ఎగిరి రోడ్డు పై పడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అధిక రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడికి భార్య సరోజన తో పాటు రమ్య, హిందు అనే ఇద్దరు కూతుర్లున్నారు.

(Sandesham Times) TG TEL/25/A0348"Title: Sandesham Times"Address: 3-82, Ananthagiri, Singavaram, Suryapet, Telangana – 508 206"Email:sandeshamtimes@gmail.com | Website: https://sandeshamtimes.com. Publisher & Printer: Amrutha Venkat Media Publication Private Limited,"3-82, Singaram, Ananthagiri Mandal, Suryapet District, Telangana – 508206" Phone: 9052045435."Printed at: Sunday Printing Press,"3-4297, Saraswathi Complex, SVN Colony, Guntur, Andhra Pradesh – 522 006